వేడుకగా వీరభద్రుడి బ్రహ్మోత్సవాలు



భక్తులకు దర్శనమిస్తున్న శ్రీ భద్రకాళీ అమ్మవారు



రాసిగా పోసిన మహానైవేద్యం

రాయచోటి టౌన్: శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో అత్యంత కీలకమైన ఘట్టం మహానైవేద్యం. ఈ మహోత్సవం తిలకించేందుకు బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. నేరుగా చూడలేని వారి కోసం లోకల్ చానల్ ద్వారా లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీని ద్వారా లక్షలాది మంది భక్తులు వారి ఇళ్లలో నుంచి ఈ మహానైవేద్య ఘట్టాన్ని తిలకించారు.

ప్రత్యేకమైన వేడుక..

స్వామి వారికి ప్రతి రోజు పూజలు నిర్వహిస్తారు. పూజలు పూర్తయిన తరువాత స్వామి వారికి నైవేద్యంగా సేరు బియ్యంతో భోజనం వండి నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ నిబంధన ప్రకారం సంవత్సరానికి ఒక రోజు స్వామి వారికి సమర్పించే పెద్ద నైవేద్యాన్ని మహానైవేద్యం అంటారు. పెద్ద మొత్తంలో ఒకే రాశిలో పోయడం వలన మహానైవేద్యం అంటారు. దీనికోసం స్వామివారి భత్యంలో రోజుకు సేరు బియ్యం చొప్పున 365 రోజులకు గాను 365 సేర్లు బియ్యంతో వండిన భోజనం, నెలకు ఒక సేరు బియ్యం ప్రకారం 12 నెలలకు 12 సేర్లు బియ్యంతో వండిన అత్తిరాసాలు (నిప్పట్లు) కూరగాయలతో వండిన వంటకాలతో పాటు పలు రకాల కూరగాయలు, దుంపలు, గుమ్మడి కాయలు వంటి వాటితో తెల్లవారు జామున మూడుగంటల నుంచే ఆనవాయితీ ప్రకారం సుండుపల్లె వాసులు తడి దుస్తులతో మడికట్టి అన్నం వండి సిద్ధం చేశారు. ఈ భోజనాలు వండటానికి కూడా మరో ప్రత్యేకత కూడా ఉంది. ఈ భోజనాలు వండటానికి సుండుపల్లె మండలం బింగివాండ్లపల్లె గ్రామానికి చెందిన వడియరాజులు మాత్రమే వండి రాశిగా పోస్తారు. దీనికి మాసాపేట వడియరాజులు కొల్లకొట్టే ఆనవాయితీ కూడా ఉంది. ఇలా రాశిపోసిన మహానైవేద్యం సమర్పణ కార్యక్రమంలో వేద పండితులు నందుల మఠం శశిభూషణ్ సిద్ధాంతి ఆచారత్వాన ఋత్వికులు, ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు. లింగాయత్తుల విన్యాసాలు, కన్నడ భక్తుల హరహర మహదేవ్ శివనామస్మరణలతో ఆలయం హోరెత్తింది.

మహా నైవేద్యం పోశారు ఇలా..

సుండుపల్లె బింగివాండ్లపల్లె గ్రామ ప్రజలు వండిన భోజనం, ఇతర వంటకాలు బుధవారం 11గంటల నుంచి రాశి పోశారు. రాశి పోసిన అన్నంపై అత్తిరాసాలు ఉంచారు. 11–45 నిమిషాలకు వేదపండితులు నందుల మఠం శశిభూషణ్ సిద్ధాంతి ఆధ్వర్యంలో శ్రీ వీరభద్రస్వామివారికి (మూడవ కన్ను) త్రినేత్రం ధరింపచేశారు. ఆ సమయంలో కన్నడ భక్తులు రౌద్రరూపంలో నిర్వహించే విన్యాసాలు.. లింగాయత్తులు వల్లించే హరహర.. మనే నినాదాలతో ఆలయ ప్రాంగణం అంతా హోరెత్తెతున్న సమయంలో స్వామివారికి సమర్పించిన అన్నరాశిపై త్రినేత్ర చూపు పడి ప్రకంపనలు జరుగుతాయి. అప్పటి వరకు ఆనవాయితీగా వస్తున్న అదును కోసం ఎదురు చూస్తున్న వడియరాజులు రాశిపై ఒక్క సారిగా పడి రాశిని కొల్లగొట్టారు. ఆలయ నిర్మాణం నుంచి కాపాడుకొనే వరకు వడియరాజులు ఎంతో కీలక పాత్ర పోషించినందు వలన వీరికి ఈ హక్కుగా వచ్చిందని శాసనాల ద్వారా తెలుస్తోంది. మిగిలిన అన్నాన్ని రాయచోటి డీఎస్పీ శ్రీధర్, అర్బన్ సీఐ సుధాకరెడ్డి, ఎస్ఐలతో పాటు ఇతర పోలీస్ సిబ్బంది క్యూ లైన్‌లో వచ్చే భక్తులకు విస్తర్లలో మహానైవేద్యం పంచిపెట్టారు.

తెల్లవారు జాము నుంచి ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలంరెడ్డి దశరధరామిరెడ్డిలతో పాటు పాలక మండలి కమిటి సభ్యులు రత్నశేఖర్‌రెడ్డి, సురేష్ బాబు, నాగభూషణ, తదితరులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగనీయకుండా ఏర్పాట్లు నిర్వహించారు.



మహానైవేద్య ప్రసాదం కోసం బారులు తీరిన భక్తులు

వైభవంగా రథోత్సవం



రథంపై ఊరేగుతున్న శ్రీభద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా 8వ రోజు స్వామి వారు రథంపై ఊరేగారు. బుధవారం బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉత్సవ మూర్తులను వేదపండితులు నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి ఆచారత్వాన ఋత్వికులు, ఆలయ ప్రధాన అర్చకులు రంగు రంగు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించారు. అనంతరం రథంను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను రథంలో ఉంచి పురవీధులలో ఊరేగించారు. ఈ ఊరేగింపులో భాగంగా కన్నడ కళాకారుల నృత్యాలు, పలు రకాల విన్యాసాలు భక్తులను అలరింపచేశాయి. వేడుకలు చూడడానికి స్థానిక భక్తులతో పాటు కన్నడ, తమిళ, మహారాష్ట్ర, తెలంగాణా రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలి వచ్చారు. ఈ వేడుకలు ఆలయ పాలక మండలి అధ్యక్షులు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవో డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డి, పాలక మండలి సభ్యులు రత్నశేఖర్ రెడ్డి, సురేష్ బాబు, నాగభూషణం తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

క్లుప్తంగా

ప్రణాళిక ప్రకారం చదవాలి



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ శంకరయ్య

సిద్దవటం : పదవ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలంటే యాక్షన్ ప్లాన్ ప్రకారం చదవాలని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ శంకరయ్య మాట్లాడుతూ సమాజంలో పేరు ప్రఖ్యాతులను పొందాలంటే విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను ఇష్టపడి చదవాలన్నారు. ఏరోజుకు ఆరోజు ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు



జూనియర్ కళాశాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వీరబల్లి: కేజీబీవీ జూనియర్ కళాశాలలో డాక్టర్ వినయ్ బాబు, మెడికల్ ఆఫీసర్, వీరబల్లి పీహెచ్‌సీ వారు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి విద్యార్థినులకు హెచ్‌బీ పరీక్షలు చేశారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో రక్తం తక్కువగా ఉన్న విద్యార్థినులకు చికిత్స అందించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంను స్పెషల్ ఆఫీసర్ జయరాం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు శిరీషా, జ్యోతి, ప్రేమకుమారి, గంగాదేవి, సీహెచ్ఓ సుధాకర్, కల్పన, ఎల్‌టీ సుబ్బయ్య, పీహెచ్ఎన్ గంగులమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందుల కలిగిస్తే చర్యలు



ఆటోడ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న ఏఎస్ఐ శంకర్‌నాయక్

నందలూరు (రాజంపేట): కడప–రేణిగుంట నేషనల్ హైవేలోని నందలూరు బస్టాండు సర్కిల్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని నందలూరు ఏఎస్ఐ శంకర్ నాయక్ హెచ్చరించారు. బుధవారం బస్టాండు సర్కిల్‌లో ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనసరిగా పాటించాలన్నారు. ప్రతి ఒక్క డ్రైవరు లైసెన్స్ కలిగివుండాలని, ఆటోడ్రైవర్లు డ్రస్సు వేసుకోవాలన్నారు.

20లోపు డీడీలు కట్టాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీటీ శ్రీనివాసులు

పెనగలూరు: డీలర్లు సరుకులు కోసం ప్రతి నెలా 20వ తేదీలోపు డీడీలు కట్టాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్ రావు అధ్యక్షతన డీలర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీలర్లు చెక్కర, కందిబేడలకు ప్రతి నెల 20వ తేదీలోపు డీడీలు కట్టాలని తెలియజేశారు. అలాగే గోడౌన్‌నుంచి బియ్యం తీసుకువచ్చేటప్పుడు డీలర్లు స్వయంగా వెళ్లి వేలిముద్ర వేసి తెచ్చుకోవాలన్నారు. కొంతమంది డీలర్లు బియ్యం తక్కువ వస్తున్నాయని ఫిర్యాదులు చేయడం కంటే మీరే వెళ్లి స్వయంగా తీసుకురావాలన్నారు. మండలంలో 24 మంది డీలర్లు ఉంటే కేవలం 10 మంది మాత్రమే హాజరయ్యారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్ర మోహన్ రెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

రేపు శిక్షణా కార్యక్రమం

రామాపురం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9గంటలకు కన్వీనర్లు, గృహ, సారధులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ గడికోట జనార్దన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఐ ప్యాక్ టీం సభ్యులు పాల్గొంటారని, మండలంలోని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ సచివాలయం బూత్ కన్వీనర్‌లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఉయ్యాలవాడకు ఘన నివాళి



ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సంబేపల్లె : ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం సంబేపల్లె మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ బ్రిటీష్ వారిని ఎదిరించిన తొలి తెలుగు విప్లవ వీరుడు నరసింహారెడ్డి అని కొనియాడారు. అనంతరం స్వాతంత్ర్యోద్యంలో ఆయన పోరాట పటిమను స్మరించుకొన్నారు.

భూములు ఆక్రమిస్తే చర్యలు



భూమిని చదును చేయిస్తున్న తహశీల్దార్ నరసింహకుమార్

పుల్లంపేట: భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. గతంలో ఓ మహిళకు సంబంధించిన భూమి ఆక్రమణకు గురైతే అధికారులు చొరవ చూపి ఆ భూమిని ఆ మహిళకు అప్పగించారు. వివరాలు..

మండల పరిధిలోని దేవసముద్రం గ్రామ పంచాయతీలోని సర్వే నెంబరు. 556/7లో 1.50 ఎకరాలు భూమిని మురముట్ల రెడ్డమ్మ అనే మహిళా రైతుకు గతంలో పట్టా మంజూరు చేశారు. అయితే అదే గ్రామానికి చెందిన రైతు నాగినేని చెంగయ్య నాయుడు గత తెలుగుదేశం ప్రభుత్వంలో ఆక్రమించుకొని యథేచ్ఛగా పంటలు సైతం సాగు చేశాడు. మురముట్ల రెడ్డమ్మ 2017లో ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌కు నాగినేని చెంగయ్య నాయుడుపై ఫిర్యాదు చేసింది. దీంతో బుధవారం తహశీల్దార్ నరసింహకుమార్ తన సిబ్బందితో కలిసి చట్టబద్ధంగా చెంగయ్య నాయుడుకు నోటీసులు అందించి జేసీబీ ద్వారా బుధవారం భూమిని చదును చేసి మురముట్ల రెడ్డమ్మకు అందించారు. దీంతో మురముట్ల రెడ్డమ్మ హర్షం వ్యక్తం చేసింది.

బండలాగుడు పోటీలు

నందలూరు (రాజంపేట) : చెయ్యేటి పరీవాహక గ్రామమైన నందలూరు మండలంలోని టంగుటూరులో శ్రీ కామాక్షి సమేత కైలాసనాథేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం బండలాగుడు పోటీలు కొనసాగాయి. ఈ పోటీలను అవధానం కుమారస్వామి శర్మ జెండా ఊపి ప్రారంభించారు. పోటీలలో మొదటి బహుమతిని నందలూరుకు చెందిన హబీబుల్లా కు చెందిన వృషభాలు, రెండవ బహుమతిని కోనేటి సందీప్‌కుమార్‌రెడ్డికి చెందిన ఎద్దు గెలుపొందాయి. మొదటి బహుమతిని మంచామురహరి చేతుల మీదుగా మంగళపురి ఈశ్వరయ్య, రెండవ బహుమతి చుక్కా వెంకటేశ్వర్లు అందచేశారు. కార్యక్రమంలో మంచా మురహరి, మోహన్‌రాజు, బీసీ నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, మండల కన్వీనరు చుక్కా వెంకటేశ్వరయ్య, గుజ్జల ఈశ్వరయ్య, మదన్‌మోహనపురం సర్పంచి చుక్కా యానాది, మంచా పణీంద్ర, మీనిగ నాగభూషణం, మునగ హరి, మద్దెల రాజా, మంగళపురి ఈశ్వరయ్య, రామన్నగారి శివతోపాటు గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

24న వాహనాల వేలం

రాజంపేట : ఈ నెల 24న రాజంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో పలు నేరాల కింద పట్టుబడి, సీజ్ అయిన వాహనాలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ శ్రీహరిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె ఎస్ఈబీ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఈ వేలంపాటను ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు రుసుం చెల్లించి వేలంపాటలో పాల్గొనాలన్నారు. వివరాలకు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్‌ను సంప్రదించాలని కోరారు.

సైనికుల్లా పనిచేయాలి

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



మా నమ్మకం నువ్వే జగన్ కరపత్రాలలోని అంశాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



కార్యక్రమానికి హాజరైన గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు

సంబేపల్లె : గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు సైనికుల్లా పని చేయాలని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

బుధవారం సంబేపల్లె మండల కేంద్రంలో ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ దేశం గర్వపడే విధంగా ప్రజా సంక్షేమ పాలనను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశయాలను ప్రజల చెంతకు తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అనే నినాదంతో ముందుకు సాగుతూ అభివృద్ధి ఫలాలు అందుకుంటున్న లబ్ధిదారులకు జగనన్న ఆశయాలను, పార్టీ సిద్ధాంతాలను వివరించాలన్నారు. గృహసారథులు వారికి అందజేసిన సామగ్రితో బ్యాడ్జీలు ధరించి ఆయా వాలంటీరు పరిధిలోని ఇంటికి వెళ్లి జగనన్న ప్రతినిధులుగా పరిచయం చేసుకోవాలన్నారు. జగనన్న ప్రభుత్వంలో కుల, మత, వర్గ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్న విషయాలను ప్రతి కుటుంబానికి తెలియజేయాలన్నారు. 2024 లో వైఎస్ఆర్ సీపీ గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా పనిచేయాలన్నారు. ప్రతి పక్షపార్టీ, పచ్చమీడియా దుష్ప్రచారాలను తిప్పి కొట్టే విధంగా ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించాలన్నారు. రాయచోటిని జిల్లా చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ నాగశ్రీలక్ష్మీ రాష్ట్రకార్యదర్శి చిదంబర రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్ రెడ్డి, జెడ్పీటీసీ కవిత, మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

వీరబల్లి : రాష్ట్ర మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం వీరబల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు బుధవారం వైఎస్సార్ సీపీ మత్స్యకార నేత సుంకు రవీంద్ర ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు, జ్యూస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీరబల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కొత్త శివశంకర్ రెడ్డి, వంగిమల్ల డి రాచపల్లి ఉపసర్పంచ్ మాచినేని గురయ్య, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

సోమశిల బ్యాక్‌వాటర్‌లో చేపపిల్లలు విడుదల



నందలూరు (రాజంపేట) : సోమశిల వెనుకజలాలలో ఐదులక్షల చేపపిల్లలను విడుదల చేశారు. బుధవారం కోనాపురంలో చేపపిల్లల విడుదల కార్యక్రమానికి మత్స్యశాఖ జిల్లా అధికారిణి సుస్మిత హాజరయ్యారు. ఈమెతోపాటు అడిషనల్ డైరక్టరు రెడ్డయ్య, రాజంపేట ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సుబ్బనరసయ్య, ఇరిగేషన్ అధికారి కృష్ణమూర్తి, మత్స్యకారుల లైసెన్సు దారులు, గ్రామమత్స్యకారులు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత

ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



క్రికెట్ పోటీల ప్రారంభంలో బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : జగనన్న పాలనలో క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఈద్గా మైదానంలో బుధవారం వైఎస్ఆర్‌సీపీ నేత బేపారి మహమ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన మున్సిపల్ చైర్మన్ చిల్లీస్ ఫయాజ్ బాష, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, బేపారి మహమ్మద్ ఖాన్‌లతో కలసి ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాష బౌలింగ్ చేయగా ఎమ్మెల్యే బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు అబుసిద్దిఖ్ ట్రావెల్స్‌వారి సహకారంతో బేపారి బషీర్‌ఖాన్ క్రికెట్‌పోటీలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. జిల్లా కేంద్రంగా మారిన రాయచోటిలో 25 ఎకరాల స్థలంలో రూ.1.5కోట్ల ఖర్చుతో అత్యాధునిక క్రీడామైదానం నిర్మిస్తున్నట్లు తెలిపారు.

వజుఖానా పనులను త్వరగా పూర్తిచేయండి..

పవిత్ర రంజాన్ పండుగకు ముస్లిం, మైనార్టీలు నిర్వహించే ప్రార్ధనల కోసం నిర్మిస్తున్న వజుఖానా పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం అనంతరం ఆయన మైనార్టీనేత బేపారి మహమ్మద్‌ఖాన్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు చిల్లీస్ ఫయాజ్‌బాష, ఫయాజుర్ రహిమాన్‌తో కలసి ఈద్గా మైదానంలో సాగుతున్న వజుఖానా నిర్మాణం పనులను పరిశీలించారు. ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి నిధులతో సాగుతున్న నిర్మాణం పనులను రంజాన్ పండుగలోపు పూర్తిచేయాలంటూ కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాదక్‌అలీ, చాన్‌బాష, రౌనఖ్ హుస్సేన్, వైఎస్ఆర్‌సీపీ నేతలు జిన్నాషరీఫ్, ఆర్బ్ శంకర్, షబ్బీర్, సుగవాసి శ్యామ్‌కుమార్, గువ్వల బుజ్జిబాబు, విజయ భాస్కర్, ఖాదర్ వలీ, ఫయాజ్ అహమ్మద్, మూసా, పల్లపు రమేష్, హసన్‌బాష, విక్కీ, అజ్మత్, ఫైరోజ్ ఖాన్, జబీవుల్లాఖాన్, అసద్‌ఖాన్, ఖైజర్, రఫీ, షకీల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

వాలంటీర్ల దాతృత్వం

ఓబులవారిపల్లె : మండలంలోని చిన్నంపల్లి ఎస్టీకాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో డెక్కిలి సుబ్రమణ్యంకు చెందిన పూరిగుడిసె పూర్తిగా కాలిపోయి సర్వం కోల్పోయారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి తేజ ఆధ్వర్యంలో వాలంటీర్లు అందరూ ఆ కుటుంబానికి సహాయం చేయాలనే ఉద్దేశ్యంతో రూ. 7 వేలు నగదును, బియ్యం, దుస్తులను బాధిత కుటుంబానికి అందజేశారు. వాలంటీర్లు చేసిన సేవలకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఓ శ్రీనివాసులు, వాలంటీర్లు రెడ్డయ్య, శ్రీవాణి, తిరుపాలు పాల్గొన్నారు.

జనసంద్రంగా గంగ జాతర



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న అనంతపురం గంగమ్మ దేవత



ఆకట్టుకున్న చాందినీ బండి

లక్కిరెడ్డిపల్లె : రాయలసీమలోనే అతి పెద్ద జాతరగా పేరుగాంచిన లక్కిరెడ్డిపల్లె మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన అనంతపురం గంగమ్మ దేవత జాతర రెండవ రోజు బుధవారం మైల తిరుణాలకు భక్తులు భారీగా తరలి రావడంతో జాతర జనసంద్రంగా మారింది. తెల్ల వారుజామున 2 గంటల సమయంలో అమ్మవారు అశ్వవాహనంపై ఆలయ ప్రాంగణం చుట్టూ వైభవంగా దర్శనమిస్తూ మెరవణిగా ఆలయం చేరుకుంది. రాయలసీమ జిల్లాల నుండి నాలుగు వందలకు పైబడే చాందిని, కుంకుమ, ఎద్దుల బండ్లు జాతరకు చేరుకోవడంతో ట్రాఫిక్ సమస్య పోలీసులకు సవాల్‌గా మారింది. అన్నమయ్య జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో సీఐ వరప్రసాద్, ఎస్ఐ వినోద్ కుమార్‌లు పోలీసు బందోబస్తుతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ముందస్తుగా చర్యలు చేపట్టారు. ఆలయ చైర్మన్ నరసింహ్మా రెడ్డి, ప్రత్యేకాధికారి రవీంద్రరాజు, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. చాందిని బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. లక్షలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు. లక్కిరెడ్డిపల్లె జర్నలిస్టులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలు, మానవతా ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, నీళ్ల ప్యాకెట్లు అందజేశారు. దేవళంపల్లె, కోనంపేట పీహెచ్‌సీల వైద్యులు శిద్దయ్య ఆధ్వర్యంలో భక్తులకు వైద్య సేవలందించారు. సాయంకాలం చాగలగుట్టపల్లె అమ్మవారు బయలు దేరగానే దారి పొడవునా అమ్మవారి ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహిస్తూ పుట్టినింటికి చేర్చడంతో జాతర ముగిసినట్లు సంకేతం. ఎమ్మెల్సీ రామచంద్రయ్యతో పాటు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



గంగమ్మ జాతర ప్రాంగణం

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు

పులివెందుల రూరల్ : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీలు శ్రీనివాసులు, వాసుదేవన్‌లు తెలిపారు. బుధవారం స్థానిక జేఎన్‌టీయూ కళాశాలలో సైబర్ నేరాలు, సఖిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు, దిశా యాప్ డీఎస్పీ వాసుదేవన్‌లు హాజరై మాట్లాడుతూ లోన్ యాప్‌లు, ఉద్యోగ యాప్‌లు క్లిక్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మీ చదువు, ఉద్యోగాలకు సంబంధించిన విషయాలకు మాత్రమే ఇంటర్నెట్‌ను ఉపయోగించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మనకు అవసరమైన రీతిలో వినియోగిస్తూ చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే డబ్బులు వేరే అకౌంట్‌లోకి వెళితే ఏ నెంబర్‌కు కాల్ చేయాలి.. మొబైల్ పోగొట్టుకుంటే ఎలా దాన్ని తిరిగి తీసుకోవచ్చు.. ఎవరైనా ఇబ్బందులలో ఉన్నప్పుడు దిశ యాప్‌కు ఎలా కనెక్టు కావాలి, వన్‌స్టాఫ్ సెంటర్ ద్వారా ఇబ్బందులకు గురైన వారు ఎలా ఉపశమనం పొందవచ్చుననే విషయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసుంధర, మహిళా సాధికారిత కోఆర్డినేటర్ శేష మహేశ్వరమ్మ, విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

మదనపల్లె : వరకట్న వేధింపులపై వివాహిత ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఏఎస్ఐ వెంకట్రమణ తెలిపారు. పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన జ్యోతిఅనితకు 2019లో బి.కొత్తకోట మండలం బండారువారిపల్లెకు చెందిన వెంకటేశ్వర్లుతో వివాహమైంది. వివాహ సమయంలో బంగారు నగలతో పాటు ఆరులక్షల కట్నం ఇచ్చారు. కొద్దిరోజులపాటు వీరి కాపురం సజావుగా సాగింది. ఇటీవల కొంతకాలంగా మరో మూడులక్షలు అదనపు కట్నం తేవాలని అత్తింటివారు వేధించడం మొదలుపెట్టారు. దీంతో బాధితురాలు వారి వేధింపులు భరించలేక పుట్టింటికి వచ్చింది. బుధవారం అత్తింటి వారి వేధింపులపై టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి భర్త వెంకటేశ్వర్లు, అతడి తల్లిదండ్రులు మునిరత్నం, సరస్వతి, సోదరుడు శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.